క్లుప్తంగా

నేడు అయ్యప్పకు ఆరట్టు పూజ

రాజంపేట రూరల్ : హరిహర తనయుడు, భక్తుల కొంగుబంగారం అయ్యప్పస్వామికి సోమవారం ఆరట్టు పూజను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి దేవాలయ నిర్వాహకులు ఆదివారం తెలియజేశారు. అయ్యప్పస్వామి జన్మ నక్షత్రం సందర్భంగా శబరిమలలో జరిగే ఆరట్టు పూజ తరహాలో పూజలు చేస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 9గంటలకు అయ్యప్పస్వామి దేవాలయం నుంచి గ్రామోత్సవం ప్రారంభమై అత్తిరాల పుణ్యక్షేత్రానికి చేరుకుంటుందన్నారు. అక్కడ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం బహుదా నదిలో చక్రస్నానం చేయించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి పూజలలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి

రాయచోటి టౌన్ : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని రాయచోటి సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఎన్నికల కోడ్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల వేళ ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే జీవితాంతం మాయని మచ్చలా ఉంటుందని చెప్పారు. ఎలాంటి నేరాలకు పాల్పడకూడదని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అలాగే గొడవలకు పాల్పడకుండా ఐకమత్యంతో ఉండాలని కోరారు. ఎక్కడైనా చిన్నపాటి సమస్య తలెత్తినా వెంటనే తమను ఆశ్రయించాలని చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ పోలీసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాద స్థలం పరిశీలన



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి పక్కన రోడ్డు ప్రమాదంలో కొలూరు నాగేశ్వరరెడ్డి ఆదివారం మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం ఎలా జరిగింది, నాగేశ్వరరెడ్డి ఎక్కడికి వెళ్తున్నాడన్న విషయాలపై కొరముట్ల ఆరా తీశారు. సంఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన స్కూటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్ రాజు పాల్గొన్నారు.

నివాళి



రామిరెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని చిట్లూరు గ్రామం రాఘవరెడ్డిగారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ అయోధ్యాపురం రామిరెడ్డి(100) అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకుల నుంచి సమాచారం అందడంతో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలు మృతుడి స్వస్థలానికి వెళ్లి రామిరెడ్డి మృతదేహానికి సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మండల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, చిట్లూరు సర్పంచ్ రామాంజులు, మాజీ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆదిరెడ్డి, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, చలమారెడ్డి, ఎంపీటీసీ హరినాథరెడ్డి, అమర్‌నాథరెడ్డి, కె.నరసింహులు, రామచంద్రా రెడ్డి, పి.నరసింహులు, రమేష్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శివశంకర్, రవి, ప్రసాద్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

'ఎవరి ఓటు వారే వేయాలి'



ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఓబన్న

సిద్దవటం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎవరి ఓటు వారు వేయాలని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేటలోని బస్టాండ్ వద్ద స్థానిక ప్రజలకు ఎన్నికలకు సంబంధించి ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా ద్విచక్రవాహనాలను మద్యం సేవించిన నడపరాదన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడటం ప్రమాదకరం అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, కానిస్టేబుల్ రామ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

• వైభవంగా కనకదుర్గ జాతర



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ

పుల్లంపేట : మండలంలోని రామసముద్రం పంచాయతీలో వెలసిన కనకదుర్గమ్మ తిరునాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ప్రజలు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తిరునాలలో తినుబండారాలు, పిల్లల ఆటబొమ్మలు, రంగులరాట్నం తదితర వినోద కార్యక్రమాలు పిల్లలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే సాయంత్రం చాందినీ బండ్లు ప్రజలను ఆకర్షించాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా రాజంపేట సీఐ మంజునాథరెడ్డి, పుల్లంపేట ఎస్ఐ రఘురాంలు బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

• విశిష్టం.. మట్టల ఆదివారం



రాజంపేట టౌన్: ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు



రాయచోటి టౌన్: ఈత మట్టలు చూపుతున్న క్రిస్టియన్‌లు

రాయచోటి టౌన్/రాజంపేట: క్రైస్తవులకు ఎంతో ప్రత్యేకమైన రోజు మట్టల ఆదివారమని సంఘ కాపరులు తెలియజేశారు. ఆదివారం మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలకు ముందు సంఘ సభ్యులు ఈత మట్టలను చేతబూని హోసన్నా పాడుదాం.. యేసు రాజునకు అంటూ కీర్తనలు పాడుతూ ఆలయం చుట్టు తిరిగారు. ఈ సందర్భంగా పాస్టర్లు వ్యాఖ్యోపదేశం ఇస్తూ శ్రమల కాలంలో పరిశుద్ధ వారం (హోలీ వీక్)లోకి అడుగుపెట్టే ముందు వచ్చే ఈ ఆదివారానికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. యేసుక్రీస్తు బెత్లెహేము నగరానికి వచ్చాడని, అందుకు గుర్తుగా మట్టల ఆదివారమును వేడుకగా జరుపుకుంటున్నామన్నారు. క్రీస్తు పడిన శ్రమలను రోజూ గుర్తు చేసుకొని కృతజ్ఞతలు తెలపాలన్నారు.

• ఘనంగా ముగిసిన గంగమ్మ తిరునాల

వీరబల్లి (రాయచోటి టౌన్) : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని మాండవ్య నది ఒడ్డున వెలసిన గంగమ్మ తల్లి తిరునాల ఘనంగా నిర్వహించారు. తిరునాలలో భాగంగా శనివారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. అలాగే రాత్రి అమ్మవారి మేకపోతులు బలిచ్చారు. రాత్రి చాందినీ బండ్లు కట్టి మెరవణి చేపట్టారు. రాత్రి తిరునాలకు వచ్చిన భక్తుల కోసం వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి మదన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు అందించారు. రాత్రి భక్తుల వినోదం కోసం తాటిగుట్ట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తోలు బొమ్మలాట, చెక్కభజన ఏర్పాటు చేశారు.



అమ్మవారిని దర్శించుకొంటున్న గాలివీటి కుటుంబ సభ్యులు

• ఇఫ్తార్ పుణ్యకార్యం



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : ఇఫ్తార్ పుణ్యకార్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నమండెంలో వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నాయకుడు జహీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మైనార్టీ నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు బాబురెడ్డి, వైస్ ఎంపీపీ ఏజాజ్ అలీఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, మాజీ సర్పంచ్ సలీం, సర్పంచ్ ముసల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేష్, వెంకటప్పనాయుడు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు అంజనప్ప, గౌస్ సాహెబ్, యాహియఖాన్, బుర్హాన్ ఖాన్, సాదిక్, అజ్రూ, ఖదీర్, జేబుఖాన్, సిబకతుల్లాఖాన్, సజాద్, గీసూ, సైఫ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశాం

- గెలుపు కోసం అందరూ కష్టపడాలి
- కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రూ. 1600 కోట్లతో అభివృద్ధి చేపట్టామని ఏ కార్యకర్త అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, ముఖ్యమైన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ప్రతి కార్యకర్త కష్టపడి ప్రతి గడపకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని తెలియజేయాలన్నారు. నన్ను నాలుగుసార్లు గెలిపించినా మూడు దఫాలు ఏ ముఖ్యమంత్రి సహకరించలేదన్నారు. కేవలం మన జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక 70 ఏళ్లలో ఎవరూ చేయని విధంగా రూ.1600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడమే కాక ప్రతి గడపకు సంక్షేమం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రతి కార్యకర్త ధైర్యంగా ముందుకు వెళ్లి రాబోయే ఎన్నికలలో ఎంపీగా మిథున్‌రెడ్డిని, శాసనసభ్యునిగా తనను గెలిపించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో ప్రతి కార్యకర్త వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ శివసాయి, ఏపీటీడీసీ డైరెక్టర్ నాగేంద్ర, సుధాకర్‌రాజు, వైఎస్ అన్వర్‌బాషా, ముజీబ్, గునిశెట్టి రమేష్, సీహెచ్.రమేష్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన పెంచాలి




ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ మోహన్‌రావు

రాజంపేట రూరల్ : టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని వైద్య సిబ్బందికి ఆర్‌డీఓ టి.మోహనరావు సూచించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద ఆదివారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పుస్కరించుకొని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చెన్నకృష్ణ పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్‌డీఓ మోహన్‌రావు ముందుగా టీబీ వ్యాధి అరికట్టడంలో కృషి చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వారు జెండా ఊపి అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ టీబీ వ్యాధిని ఆదిలోనే గుర్తించేలా కృషి చేయాలని వైద్య సిబ్బందికి తెలియజేశారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. ఈ ర్యాలీ ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి ఆర్టీసీ సర్కిల్ వద్ద నున్న వైఎస్సార్ విగ్రహం వద్దకు కొనసాగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ మెడికల్ అధికారి డాక్టర్ శరత్‌కమల్, వైద్యులు అశ్వినీచంద్ర, స్నేహలత, అశోక్, టీబీ సూపర్‌వైజర్ పి.జయప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ యు.సిద్దిరామయ్య, సూపర్‌వైజర్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

టీబీ అంతం మన పంతం

లక్కిరెడ్డిపల్లె : టీబీ అంతం మనందరి పంతమని ఎంఓటీసీ వైద్యాధికారి డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి టీబీ యూనిట్ పరిధిలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా లక్కిరెడ్డిపల్లె బస్టాండ్ కూడలిలో ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. వైద్యుడు సిద్దయ్య మాట్లాడుతూ క్షయ లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. రెండు వారాలు దగ్గు, సాయంత్రం జ్వరం, బరువు తగ్గడం, ఛాతి నొప్పి, ఆకలి లేకపోవడం టీబీ లక్షణాలు అని తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం, వై.ప్రసాద్ యాదవ్, హరి, మణి, జవహర్, పుష్పవతి, సునీల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆపస్ నాయకుడు శ్రావణ్

రాయచోటి టౌన్ : 10వ తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న టీచర్లకు మినహాయింపు కల్పించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర సంఘటన కార్యదర్శి సీహెచ్ శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే స్పాట్ వాల్యుయేషన్‌లలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, 60 సంవత్సరాలు నిండిన వారికి, చంటి బిడ్డల తల్లులకు, ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న వారికి మినహాయింపు కల్పించాలని కోరారు. అలాగే ఎన్నికలలో పాల్గొనే ఉపాధ్యాయులకు మినహాయింపు కల్పించాలని జిల్లా అధ్యక్షులు నరసింహులు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధుమతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వరావు, జిల్లా సహాధ్యక్షులు రామాంజనేయుల రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు పరుశురాం, సెట్టెం ఆంజనేయులు, జిల్లా కోశాధికారి శివశంకర్, రాజంపేట డివిజన్ కార్యదర్శి గోవిందమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు రామేశ్వర్, వెంకటేశ్వర్లు, కె. నరసింహులు, నాగులయ్య, మల్లయ్య, కవిత, కెపి గంగన్న పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరులో ఉన్న మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ తెలిపారు. 2024 – 25 సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు అయితే రూ. 150లు, ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 200లు అప్లికేషన్ ఫీజుగా చెల్లించాలని పేర్కొన్నారు. మార్చినెల 28వ తేదీ నుంచి మే నెల 22వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉందని ఆమె తెలియజేశారు.

గజవాహనంపై గట్టు వెంకటరమణుడు

రామసముద్రం: రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు గజవాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

సారా స్వాధీనం

పెద్దమండ్యం: విక్రయించడానికి సిద్ధంగా ఉన్న నాటు సారాను స్వాధీనం చేసుకుని ఆదివారం ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సి గొల్లపల్లె పంచాయతీ రెక్కలకొండపల్లెకు సమీపంలో నాటు సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. రెక్కలకొండపల్లె హరిజనవాడకు చెందిన ఏ సిద్దప్ప (72) వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ముష్టూరు పంచాయతీ దిగువపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న భూదేవి(38)ని అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామన్నారు.

జూదరుల అరెస్ట్

మదనపల్లె : తొమ్మిది మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని కొండామర్రిపల్లె పంచాయతీ బోదుమల్లుదిన్నె సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడుల్లో జూదమాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.12,100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. అసాంఘిక కార్యకలాపాలు జరిపితే ఇబ్బందులు తప్పవన్నారు.

జగన్ పాలనలోనే సామాజిక న్యాయం

మోటకట్ల, పీఎస్ కాలనీలలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె : జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీకాంత్ రెడ్డి మండలంలోని మోటకట్ల పీఎస్ కాలనీ గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, చిదంబర్ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డిలతో కలిసి ప్రచారం నిర్వహించారు. మోటకట్ల, పీఎస్ కాలనీ గ్రామాలలో శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికి తిరిగి జగన్ ప్రభుత్వం అందించిన పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. జగనన్నను మరోమారు సీఎంను చేసేందుకు ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి ఫ్యానుగుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్నింటిలో బీసీలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందంటూ బడుగు, బలహీనవర్గాల ప్రజలు శ్రీకాంత్ రెడ్డి ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్‌బోన్ అని ప్రభుత్వం నిరూపించిందన్నారు. వివిధ పథకాలతో బీసీలకు ఆర్థిక లబ్ధి చేకూర్చిందన్నారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింత సంక్షేమం చేకూరుస్తారని చెప్పారు. సామాజిక న్యాయం ఒక్క జగన్ పాలనలోనే జరుగుతోందని బీసీలు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట తెలియజేశారు. నాయీబ్రాహ్మణులకు దేశ చరిత్రలోనే జగన్ ప్రభుత్వం అరుదైన గుర్తింపు, విలువ ఇచ్చిందన్నారు. అన్ని వర్గాలకు అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందని బీసీ కుటుంబాలు శ్రీకాంత్ రెడ్డి ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ గుండా సురేంద్ర, అమరనాథరెడ్డి, ఎంపీటీసీ వరలక్ష్మి, లయన్ అశోక్ రెడ్డి, జేసీబీ ప్రతాప్ రెడ్డి, మోహన్, వాసుదేవరెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డన్న, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, అనిరుద్‌రెడ్డి, ఉప సర్పంచ్ సుధీర్ రెడ్డి, కౌన్సిలర్ జానం రవీంద్ర యాదవ్, భానుమూర్తి రెడ్డి, వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా సేవా కార్యక్రమాలు



టైలర్ సుబ్బయ్య, ఎస్‌బీఐ మేనేజర్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంలను సన్మానిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : కులమతాలకతీతంగా మానవత సంస్థ ప్రజలకు కార్యక్రమాలు చేస్తోందని రాయచోటి బంగ్లా ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఫైరోజ్, నూలివీడు ఉర్దూ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు గోవింద్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం చిత్తూరు రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో మానవత నెలవారీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా పాల్గొన్న అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి (బాబు), చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డిలు మాట్లాడారు. కుల, మతం, వర్గం అనే తేడా లేకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. దాతల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవలు చేస్తామని చెప్పారు. ఎన్‌జీఓ కాలనీలో టైలరింగ్ వృత్తిలో జీవనం సాగిస్తూ కుమారుడు వెంకట శశికర్‌ను చదివించగా ఈ విద్యార్థి ఎస్వీ మెడికల్ కళాశాలలో ఫ్రీ సీట్ సాధించినందుకు ఆ విద్యార్థిని ప్రోత్సహించే క్రమంలో విద్యార్థి తండ్రికి రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్రం కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వృక్ష రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తులసీశ్వరరెడ్డి, షకీల్, జయచంద్రారెడ్డి, ఎన్వీ రాజు, వెంకటేష్, నరసింహారెడ్డి, మనోహర్‌రెడ్డి, సంగీత స్కూల్ యజమాని రామాంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం



మాట్లాడుతున్న ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

రాయచోటి అర్బన్: రైతాంగాన్ని అనేక రకాల ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తూ ఆదాయాన్ని సమకూరుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను, కార్మిక చట్టాలను మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందన్నారు. కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ కార్మికులకు హక్కులే లేకుండా చేయాలని చూస్తోందంటూ మండిపడ్డారు. అధికారంలోకి రాక ముందు చేసిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రస్థాయిలో అణగదొక్కుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో దేశంలోని బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు సలీం బాషా, వేణుగోపాల్‌రెడ్డి, దేవ, నాగేశ్వర, సికందర్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

- బంజారాలు అన్ని రంగాలలో ఐక్యతతో ముందుకెళ్దాం
- ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు అమృనాయక్



హోలీ పండుగ సంబరాలలో బంజారా మహిళలు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో మొదటిసారిగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బంజారా సుగాలీలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రజలతోపాటు బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు. బంజారాలు సుగాలీల పండుగ హోలీ అని, జాతి ఐక్యత కోసం అందరం కలిసికట్టుగా పనిచేసి ముందుకెళ్లాదమని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అమృనాయక్ పిలుపునిచ్చారు. మన జాతి సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుంటూ రాబోయే తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన పిల్లలను బాగా చదివించుకుని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాలలో ముందుకెళ్లాలన్నారు. పిల్లలను బాగా చదివిస్తే పేదరికం దూరం అవుతుందన్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం బంజారాలు, సుగాలీల సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. బంజరాల ఆరాధ్య దైవం సేవలాల్, మారెమ్మ, హథిర భగవంతులను నిత్యం కొలుస్తూ వారి సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ బంజారా కళాకారుడు బిక్షు నాయక్ వారి బృందం బంజారాలు ఆటపాటలతో అందరినీ ఉత్సాహపరిచారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సేవాలాల్ చిత్రపటాలకు ముఖ్య అతిథులు పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఉత్సవాలల్లో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రామ్మూర్తి నాయక్, లేబర్ డిపార్టుమెంట్ డిప్యూటీ కమిషనర్ బాలు నాయక్, పీఆర్ ఈఈ రామచంద్ర నాయక్, ఎంపీడీఓ శేఖర్ నాయక్, ఐఏఎస్ ధర్మనాయక్, బిల్లు నాయక్, ట్రెజరర్ నారాయణ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ నాయక్, గిరిజన సంఘం నాయకులు విశ్వనాథ నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

అనంతపురం గంగమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి సన్నిధిలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : అనంతపురంలో గ్రామంలో వెలసిన గంగమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి కృపాకటాక్షలు భక్తులందరిపై ఉండాలని కోరారు. అనంతరం ఎంపీపీని ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు దుశ్శాలువాతో సత్కరించారు. కాగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ప్రత్యేక అధికారి చమర్తి రవీంద్రరాజులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డయ్య, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, సర్పంచ్‌లు కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణ, శంకర్ నాయుడు, ఉప సర్పంచ్ రాజారెడ్డి, రాజబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ..కరుణించమమ్మా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు చేరుకొన్నారు. కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.